ఉత్తర ద్వార దర్శనం.. పుణ్యఫలం!

- ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన వైష్ణవ ఆలయాలు

బేతంచెర్ల: ముక్కోటి వైకుంఠ ఏకాదశి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రాల తోపాటుగ్రామాల్లో భక్తిశ్రద్ధల మధ్య వేడుకలు సాగాయి. భక్తులతో వైష్ణవ ఆలయాలు కిటకిటలాడాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రసిద్ధి చెందిన వైష్ణవ పుణ్యక్షేత్రం శ్రీలక్ష్మీ మద్దిలేటినరసింహ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు కనుల పండువగా జరిగాయి. వేదపండితులు భక్తులకు వేకువ జాము నుంచి స్వామివారి ఉత్తర ద్వార దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు భక్తులు తరలివచ్చారు. బారులుదీన భక్తులతో మద్దిలేటయ్య క్షేత్రం కిటకిటలాడింది. మద్దిలేటి స్వామి నామస్మరణం మారుమోగింది. మండల కేంద్రం బేతంచెర్లతో పాటు గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. స్వామివార్లను ఉత్తరద్వార దర్శనం చేసుకునేందుకు వేకువజాము నుంచే క్యూకట్టారు. నంద్యాల రహదారిలో వెలసిన గోపాలకృష్ణ బృందావనం, పలక చింతమాను ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వర స్వామి దేవాలయంలో అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో ఏకాదశి వేడుకలు జరిగాయి. ఉత్తర ద్వార దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఉత్తర ద్వారం ద్వారా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కు లు తీర్చుకుని పుణ్యఫలం పొందారు భక్తులు.





కోవెలకుంట్ల: పాండురంగస్వామి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనానికి క్యూలో నిలుచున్న భక్తులు **బనగానపల్లె:** ఉత్తర ద్వారం నుంచి వెళ్తున్న భక్తులు

కమనీయం.. కల్యాణం

బేతంచెర్ల : శ్రీలక్ష్మీ మద్దిలేటినరసింహ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం కమనీయంగా జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వేదపండితులు మేలతాళాల మధ్య కల్యాణ మండపానికి తీసుకురాగా పట్టువస్త్రాలను ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ సీతారామచంద్రుడు అందచేశారు. భక్తజన సందోహం మధ్య శ్రీదేవి, భూదేవి సమేతుడైన మద్దిలేటినరసింహస్వామి శాంతి కల్యాణం రమణీయంగా సాగింది. తిరుమల కలియుగ వైకుంట వాసుడైన శ్రీవేంకటేశ్వరునికి కల్యాణం తీరుగా వేదపండితులు శాస్త్రోకంగా మంత్రాలు చదువుతుండగా ఎదురుకోళ్ల ఉత్సవంతోపాటు గోవిందా నామస్మరణం మారుమోగుతుండగా స్వామి, అమ్మవార్ల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి, బేతంచెర్ల తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు లక్ష్మణ్ నాయుడు, ఈశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్ల కల్యాణం దృశ్యం

కొలిమిగుండ్ల: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శనివారం వైష్ణవ ఆలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నందిపాడులోని శ్రీలక్ష్మిచెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామిని తెల్లవారు జాము నుంచే భక్తులు దర్శించుకున్నారు. తిమ్మనాయినపేటలోని లక్ష్మి నరసింహస్వామి ఆలయం, కొలిమిగుండ్లలోని చెన్నకేశవస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకల్లో భాగంగా స్వామికి విశేష పూజలు నిర్వహించారు.

బనగానపల్లె రూరల్ : మండల కేంద్రం బనగానపల్లె తోపాటు గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బనగానపల్లె పట్టణంలోని భానుముక్కలలో వెలసిన పురాతన ఆలయంలో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామిని తెల్లవారు జాము నుంచి భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఈఓ బ్రహ్మానందరెడ్డి, ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు భక్తులకు అనుగుణంగా ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు.

అవుకు: మండల కేంద్రం అవుకుతోపాటు గ్రామాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. అవుకులో వెలసిన శ్రీభూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామిని ఉత్తర ద్వారంలో దర్శించుకునేందుకు వేకువజాము నుంచే బారులు తీరారు. తితిదే వారిచే ఏర్పాటు చేసిన అన్నమయ్య సంకీర్తనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ముడియాల జయచంద్రారెడ్డిలు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఎర్రమల కొండల్లో వెలసిన శ్రీలక్ష్మీ కంబగిరి స్వామిని జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ, కుమారులు చల్లా రాజ్యాభిషేక్ రెడ్డి, జూనియర్ చల్లా రామక్రిష్ణారెడ్డి, నాయకులు చల్లా రామేశ్వర రెడ్డి, చల్లా చరణ్ రెడ్డి, చైతన్య రెడ్డిలు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డోన్ టౌన్ : మండల కేంద్రం డోన్‌తోపాటు గ్రామాల్లో ముక్కోటి వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారిని ఉత్తరద్వారంలో దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులతో కిక్కిరిసింది. గోవింద నామ స్మరణంతో ఆలయం మారుమోగింది. పట్టణంతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాతాళం సుబ్బారావు,రజనీకుమారీ, శ్రీనివాసులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బేతంచెర్ల : భక్తులకు దర్శనమిస్తున్న శ్రీలక్ష్మీమద్దిలేటి నరసింహస్వామి









డోన్ టౌన్ : వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం, ఉత్తర ద్వార దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు **డోన్ :** వెంకటేశ్వర స్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు **బనగానపల్లె :** స్వామివారి ప్రసాదం పంపిణీ చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయం



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : ఏసుక్రీస్తు సూచించిన మార్గం అనుసరణీయమని, ప్రతి ఒక్కరూ పాటించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి క్రిస్మస్ పర్వదీనం సందర్భంగా నియోజకవర్గ క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏసు క్రిస్తు పుట్టిన రోజు వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ యువజన కార్యవర్గం నియామకం

డోన్ టౌన్ : డోన్ నియోజకవర్గంలోని మండలాలు, మున్సిపల్ పరిధిలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగాలకు వైఎస్సార్‌సీపీ అధిష్టానం నూతన కార్యవర్గాన్ని శనివారం నియమించింది. డోన్ మండల యువజన విభాగం అధ్యక్షునిగా దొరపల్లె చిరంజీవి, పట్టణ విభాగం అధ్యక్షునిగా ఆర్‌ఈ రాజవర్ధన్, బేతంచెర్ల మండల విభాగం అధ్యక్షునిగా మురళీధర్, పట్టణ విభాగం అధ్యక్షునిగా ఫిరోజ్ అహ్మద్ ఎంపికయ్యారు. అదేవిధంగా ప్యాపిలి మండల యువజన విభాగం అధ్యక్షునిగా ప్రకాష్‌రెడ్డిని నియమించినట్లు కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తాం

అవుకు: వైఎస్సార్‌సీపీ గెలుపునకు తమవంతు కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం జిల్లా బీసీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎస్ వెంకటేశ్వర్లు, జిల్లా వికలాంగుల విభాగం కమిటీ ప్రధాన కార్యదర్శిగా షేక్ కరిముల్లాను నియమించింది. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి, చల్లా కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రైల్వే పెన్షనర్స్ దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాఘవరావు

డోన్ రూరల్ : పట్టణంలోని మర్రి రాఘవయ్య భవనంతో శనివారం రైల్వే పెన్షనర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 73సంవత్సరాల సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. అనంతరం పెన్షనర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు రాఘవరావు మాట్లాడు తూ పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రామచంద్రావు, బ్రాంచ్ కార్యదర్శి రంగస్వామి, ట్రెజరర్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మృతుని కుటుంబానికి నగదు అందజేస్తున్న బలిజ సంఘం నాయకులు

అవుకు: మండల కేంద్రం అవుకులోని పాత క్రాంతి ఆఫీస్ ఏరియాకు చెందిన మునిమడుగు పాండురంగడు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అవుకు బలిజ సంఘం నాయకులు మృతుని ఇంటి వద్దకు వెళ్లి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్యపడొద్దని ఓదార్చారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు సంఘం తరుపున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, జక్కామధు, వరప్రసాద్, కళాధర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దానిమ్మ తోట దగ్ధం



దగ్ధమైన దానిమ్మ తోట

ప్యాపిలి: మండల పరిధిలోని చిన్నపొదిళ్ల గ్రామంలో శనివారం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దానిమ్మ తోట దగ్ధమైంది. మహిళా రైతు ధారా మంజులమ్మ తనకున్న మూడున్నర ఎకరాల్లో దానిమ్మ సాగు చేస్తోంది. శనివారం మధ్యాహ్నం షార్ట్‌సర్క్యూట్ జరగడంతో ఒక్క సారిగా డ్రిప్ పైపులకు మంటలు వ్యాపించాయి. డ్రిప్ పైపుల ద్వారా దానిమ్మ చెట్లకు కూడా మంటలు వ్యాప్తి చెండటంతో తోట దగ్ధమైంది. కాయలతో కళకళలాడిన తోట ఒక్కసారిగా కాలి బూడిద కావడంతో మంజులమ్మ కన్నీటి పర్యంతమైంది. ప్రమాదంలో దాదాపు ర.3.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు ఆమె వాపోయింది.

నంద్యాల జిల్లా వృషభాలు ప్రథమ స్థానం

బేతంచెర్ల : మండ పరిధిలో వెలసిన శ్రీ లక్ష్మీమద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి బ్రహ్మోత్సవముల సందర్భంగా శనివారం నిర్వహించిన న్యూకేటగిరి బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పాణ్యం మండలం, ఎస్ కొత్తూరు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యేశ్వర్‌రెడ్డి వృషభాలు ప్రథమ, గుంటూరు జిల్లాకు చెందిన పులగం త్రిశజ్ఞరెడ్డి వృషభాలు ద్వితీయ స్థానంలో నిలిచాయి. అదేవిధంగా తెలంగాణా రాష్ట్రం, గద్వాల జిల్లా, చింతరేవులకు చెందిన అంజిగౌడు, కొచ్చెర్వు లక్ష్మీదేవి వృషభాలు తృతీయ, ప్రకాశం జిల్లా, కాజీపురం గ్రామానికి ఓసుర రెడ్డి వృషభాలు నాల్గవ స్థానం, నంద్యాల జిల్లా బుక్కాపురం వృషభాలు 5వ స్థానం కై వసం చేసుకున్నాయి. ఆరు, ఏడు, ఎనిమిది స్థానాల్లో వరుసగా కోటకందుకూర్ లక్ష్మీ శరణ్యారెడ్డి, గుంటూరు జిల్లా, మునుగోడు శ్రీనివాసరావు, డోన్ మద్దయ్య వృషభాలు నిలిచాయి. విజేత వృషభాల యాజమాన్యాలకు వరుసగా రూ. 55 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ. 3వేలు చొప్పున నగదు బహుమతులను ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామ చంద్రుడు చేతుల మీదుగా అందజేశారు.



హోరా హోరీగా బండలాగుతున్న వృషభాలు

ఆహార ఉత్పత్తుల ఎగుమతిలో అగ్రస్థానం



మాట్లాడుతున్న కేవీకే ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మీ

బనగానపల్లె రూరల్ : రైతుల కృషితో ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్లో ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచామని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మీ తెలిపారు. శనివారం యాగంటిపల్లె గ్రామ సమీపంలోని కేవీకేలో ప్రధాన అధికారి ధనలక్ష్మీ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ధనలక్ష్మీ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో దేశం అభివృద్ధి చెందడంలో రైతుల పాత్ర ఎంతో ఉందన్నారు. రైతులు అవసరం మేరకు మాత్రమే ఎరువులు, పురుగుమందులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే ఏఓ సురేష్‌కుమార్, శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ, రవిగౌడ్, లక్ష్మీ ప్రియ, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

ప్యాపిలి: ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని అంబుడ్స్‌మెన్ పర్సన్ సురేంద్ర అన్నారు. మండల పరిధిలోని నల్లబల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మస్టర్లను తనిఖీ చేసి కూలీలతో మాట్లాడారు. పనికి తగిన వేతనం పొందాలంటే కూలీలు తప్పనిసరిగా కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. 100 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి కూలీలు 18 సంవత్సరాల లోపు ఉన్న తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపాలన్నారు. అనంతరం ఆయన పండ్లతోటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ రమణ పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న అంబుడ్స్‌మెన్ పర్సన్

యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ‘ఆడుదాం ఆంధ్రా’



ప్యాపిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

ప్యాపిలి: యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. స్థానిక బాలికల పాఠశాల విద్యార్థినులతో శనివారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి సచివాలయం స్థాయిలో క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర పోటీలు ఉంటాయన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులు క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సరళాదేవి, ఈఓ శివకుమార్ గౌడ్, పీడీ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు క్రిస్మస్

- నేటి నుంచి ప్రత్యేక ప్రార్థనలు
- విద్యుత్ దీపాల అలంకరణలో చర్చిలు

కోవెలకుంట్ల: క్రిస్మస్ వేడుకలు ఈ నెల 25న భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు చర్చిల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం అర్ధ రాత్రి నుంచి క్రిస్మస్ ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు చర్చిలు ముస్తాబయ్యాయి. ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఏసుక్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా క్రిస్మస్ ట్రీని తయారు చేసి బాల యేసు, మరియమ్మ ప్రతిమలను ప్రతిష్ఠించారు. కోవెలకుంట్ల– నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో వెలసిన ఆర్‌సీఎం చర్చిలో క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా సీఎస్ఐ, హోసన్న, నూతన యేరుసలేం చర్చిలు ముస్తాబయ్యాయి.

కొలిమిగుండ్ల: క్రిస్మస్ వేడుకలకు చర్చిలు అందంగా ముస్తాబయ్యాయి. మండల కేంద్రం కొలిమిగుండ్లలోపాటు గ్రామాల్లో ప్రార్థనా మందిరాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. అదేవిధంగా శాంతా క్లాజ్, క్రిస్మస్ ట్రీలు ఏర్పాటు చేశారు.



విద్యుద్దీపాల వెలుగులో బెలుం సీఐఎస్ఐ చర్చి

క్రిస్మస్‌కు చర్చీలు ముస్తాబు

బనగానపల్లె రూరల్ : మండల కేంద్రం బనగానపల్లెతోపాటు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలకు చర్చీలు ముస్తాబయ్యాయి. ఆర్‌సీఎం, సీఎస్ఐ టౌన్ చర్చి, మదర్‌థెరిస్సా, హోసన్న మందిరం, ఏసుకృప మందిరం, హెబ్రోన్, పెంతె కోస్తు తదితర చర్చీలను ప్రత్యేకంగా అలంకరించారు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన సీఎస్ఐ చర్చి



బాల ఏసు జననానికి సంబంధించి పశువుల పాక ఏర్పాటు చేసిన దృశ్యం



బనగానపల్లె విద్యుత్ దీపాలంకరణలో సీఎస్ఐ టౌన్ చర్చి

ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్‌గా మద్దయ్య

బనగానపల్లె : ఏపీడబ్ల్యూజేఎఫ్ నంద్యాల జిల్లా కన్వీనర్‌గా జి మద్దయ్య యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం కర్నూలులో జరిగిన ఏపీడబ్ల్యూజేఎఫ్ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోరంట్ల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకునట్లు మద్దయ్య యాదవ్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బహుమతులు అందజేత

డోన్ టౌన్ : వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా డోన్ తాలూక సమగ్ర వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు ఏఈ నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ మేరకు శనివారం విజేతలకు డిప్యూటీ తాహసీల్దార్ మధు బహుమతులు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని మర్రికుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మురళీధర్ రెడ్డి తండ్రి కుంచ సుబ్బారెడ్డి (58) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు బుగ్గన కుమార్ రెడ్డి లు కుంచ సుబ్బారెడ్డి మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సుబ్బారెడ్డి మృత దేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్

అన్నదాత కష్టాన్ని అందరూ గుర్తించాలి

ప్యాపిలి: ప్రజల కోసం అన్నదాతలు పడుతున్న కష్టాన్ని అందరూ గుర్తించాలని తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ తెలిపారు. స్థానిక శివసాయి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శనివారం జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు, నాటికలు ఆకట్టుకున్నాయి. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ సెలవు రోజుల్లో విద్యార్థులు తమ పరిసరాల్లో రైతుల వ్యవసాయ పనులను గమనించాలన్నారు. విత్తనం నుంచి పంట కోసే వరకు రైతు పడుతున్న కష్టాలను తెలుసుకోవాలన్నారు. అప్పుడే భూమి ప్రాధాన్యత, రైతుల పడుతున్న కష్టం తీరు అర్థం అవుతుందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సురేశ్ కుమార్, హెచ్‌ఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కాపు సంక్షేమసేన జిల్లా అధ్యక్షుడిగా పొల్లపాటి వెంకట రమణ

అవుకు: నంద్యాల జిల్లా కాపు సంక్షేమసేన అధ్యక్షుడిగా అవుకు పట్టణానికి చెందిన పొల్లపాటి వెంకటరమణ (దంతెల రమణ)ను కేఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చేగొండి హరి రామజోగయ్య ఎంపిక చేశారు. ఈ సందర్భంగా దంతెల రమణ శనివారం విలేరులతో మాట్లాడారు. తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. కాపు, బలిజల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

‘ఆడుదాం ఆంధ్రా’ పోటీలు విజయవంతం చేద్దాం

కొలిమిగుండ్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ సాయికృష్ణ పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ఉన్నత పాఠశాల వరకు పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. క్రీడా మైదానంలో విద్యార్థులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఎంపీడీఓ ట్రయల్‌గా క్రికెట్ ఆడారు. ఈనెల 26 నుంచి మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.